


"బయట వర్షం చక్కగా, వెచ్చగా కురుస్తోంది" అనుకున్నాడు రాజు.

అతను కూర్చున్న గది, గదిలోని బల్బా వెచ్చగా ఉన్నాయి. మదిలోని ఆలోచనలు మరింత వెచ్చగా ఉన్నాయి.

డబుల్ కాట్ బెడ్ మీద ఒక పక్కకి ఇటు తిరిగి పడుకుంది అతని భార్య సీతారత్నం.

ఎర్రటి ఫుల్ వాయిల్ చీరలో దీపం కాంతిలో వచ్చగా మెరిసిపోతోంది.

కుర్చీలోంచి లేచి మంచం దగ్గర కెళ్ళాడు. ఆమె లోకి చూశాడు. పగలల్లా పడిన శ్రమకి చిహ్నం ఆమె నిద్ర అనుకున్నాడు. బొట్టు చెరిగిపోయింది. అలా ఉంటేనే ఆమె అందంగా ఉంటుంది. కాని అత నా విషయం చెప్పినప్పటికీ ఆమె పట్టించుకోదు.. సాంప్రదాయ లక్షణం అంటుంది. కోపంకూడా తెచ్చుకుంటుంది. అప్పటికీ ముద్దు పెట్టుకున్నప్పుడు అతనామెకు తెలియకుండా బొట్టుచెరిపేస్తుంటాడు. చెరిపేసి నవ్వుకుంటాడు.

కొద్దిగా మంచం మీదకు వాలి సరిగ్గా విశాలమైన ఆమె నుదుటి మధ్యగా ముద్దు పెట్టుకున్నాడు. ఉలిక్కిపడ్డాడు. నుదురు కాలిపోతోంది. చేతి మీద చేయి వేసి చూశాడు. అక్కడా అంతే.

ఆమె కనురెప్పలలో కదలిక. ఆమె గులాబీరేకుల్లాంటి పలచటి పెదాలలో కదలిక.

"అమ్మ దొంగా! మెలుకువగానే ఉన్నావ్."

"ఇది వర్షం రాత్రి." ఆమె నవ్వుతూనే అంది.

'ఆమె ఒంట్లోని వేడి జ్వరం కాదన్నమాట.

నెలకు రు. 1000/- లు
సంపాదించుకొనండి
ఎలెక్ట్రిక్ గైడ్ 10/—, ఫోటోగ్రఫీ 5/—, ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ 5/—, వివాహ జీవితం 100 చిత్రాలతో 6/—, మెడికల్ సెక్స్ గైడ్ 88 చిత్రాలతో 8/—, టైలరింగ్ అండ్ కట్టింగ్ 6/—, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ 8/—, 350 ఎంబ్రాయిడరీ డిజైన్లు 8/—, సబ్బు తయారు చేయటం 5/—. హిందీ స్వబోధిని 5/—, పోస్టేజి ఒక్కొక్కటికి 1—50.
ILFA BOOK DEPOT
25, Aligarh, (U.P.).

దేవి పిల్స్ REGD.
వాడండి ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టుకు
స్త్రీలోపము ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు
SEALED PACKING 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO., MADRAS-21

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ ...



నరముల బలహీనత, ధాతుపుష్టి, యవ్వనశక్తి, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్ట్ ద్వారా కూడా కలదు. వరిబీజం (బుడ్డ), మూత్రవ్యాధులకు ఆపరేషన్ లేకుండా-రండి.
డా॥ దేవర
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్డు, మద్రాసు—17

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది.
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మద్రాసు—600 017

ఆమె పక్కన చేరాడు.

"ఇవాళ వర్షానికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు చెప్పుకుంటాను."

"ప్రతీ రోజూ ఎవరికి చెప్పుకుంటున్నారు?" చిలిపిగా అడిగిందామె.

"రాణిగార్కి" అంటూ ఆమెను కౌగిల్లోకి లాక్కున్నాడు.

ఆమె ఏ మాత్రం అభ్యంతరం చెప్పకుండా లైటు వైపు చూసింది. అతను ఆ విషయాన్నర్థం చేసుకున్నాడు.

ఇప్పు డాగదిలో ఇంతవరకూ బయట ఉన్న చీకటి. చీకటికి అడ్డులు, ఎల్లలూ లేవు. తలుపులు తీయకుండానే అది లోపలికివచ్చేయగలదు, పారిపోనూ గలదు.

వాళ్ళిద్దరూ ఇప్పుడు 'చీకటి'కి ప్రతినిధులు.

## 2

సరిగ్గా అదే సమయంలో. . .

రాజు వాళ్ళ ఇంటి ముందు రెండు వాటాల పెంకుటింటి ముందు ఖాళీ స్థలంలో 'మొగుడు పెళ్ళాన్ని దబదబా బాదేసి తన కసిని తీర్చుకుంటున్నట్లు, భయంకరంగాను, అసహ్యంగాను వర్షం కురుస్తోంది.

అక్కడే ఉన్న బాదం చెట్టు కింద ఒక మనిషి స్త్రీ—ఆమె నెవరూ 'ఆమె' అని అనరు. 'అది' అంటారు. పేరు?. . . దానికే తెలియదు. పేరెట్టి పిలిస్తేనే కాని పలకదనే పట్టింపూ ఉండదు. పుట్టిన పాతికేళ్ళ తరవాత బారసాల జరుపుకుని పేరు పెట్టుకోవాలన్న కోరికా దానికి లేదు. ఉన్నా అది తీరే మార్గమూ లేదు. అసలు ఉన్న జానెడు పొట్టకే టికానా లేనప్పుడు పేరుంటే నేం లేకపోతే నేం. వృత్తి?. . . ఊళ్ళోని ఇళ్ళన్నీ చూస్తూ ఏ గుమ్మం దగ్గరైనా పట్టెడు అన్నం పెట్టే చెయ్యే దన్నా కనిపిస్తుందేమోనని అన్వేషించడమే నని గ్రహించడం చాలా సులువు.

అదే రాత్రి కాకుండా పగలయి ఉంటే 'అది నల్లగాను, ఈనుపుల్లగాను ఉంటుందని, నిండిన నెలలతో బాధ పడుతూ ఉన్నదీ' అని ఇట్టే ఎవరైనా చెప్పేయగలరు.

ఆమె అసలు రాత్రుళ్ళు మెయిన్ రోడ్డులో ఉన్న ఏదో ఒక కొట్టును ఆశ్రయించుకుని ఉంటుంది. మళ్ళీ పొద్దుటే తిండి కోసం అన్వేషణ సాగిస్తూం టుంది. ఈ వేళ మామూలుగానే దినచర్య పూర్తయే వేళ ఇక్కడి కొచ్చేసరికి వర్షం పట్టుకుంది. వర్షంలో వేగంగా నడిచే శక్తికూడా ఆమెకు లేదు.

ఆ సమయంలోనే ఆకాశంలో మెరిసిన మెరుపుతో పాటు ఆమె బుర్రలోకూడా ఆశ తళుక్కుమంది.

ఎదురుగా ఉన్న పెంకుటిల్లు ఆశాదీపంలా కనిపించింది.

'మొన్ననే పక్క వాటా ఖాళీ అయ్యిందికూడా. ఆ ఇంట్లో వాళ్ళు ఖాళీచేయడం తనుచూసిందికూడా. ఆ ఇల్లు గల వాళ్ళు అడిగితే కాదనరేమో. . . కాస్త జాగా ఇవ్వచ్చు. . . వర్షం ఎలాను తగ్గేట్టు లేదు.'

ఆలోచనలు అతి భారంగా వర్షంలో అతి ఘోరంగా తడిసిపోతున్నప్పటికి అక్కడికి చేర్చాయి. గేటు తీసుకుని లోపల కెళ్ళింది. అరుగు ఎక్కింది. వర్షం బారి నుండి కొంతవరకు తప్పించుకో గలిగింది. కాని జల్లు ఇంకా ఆమెను వెన్నంటుతూనే ఉంది. 'వాయుదేవుడి ప్రేయసి', 'వరుణదేవుడి సోదరి' అయిన చలి ఎముకలను కొరికేస్తూంది.

మెల్లగా భయంగా తలుపు మీద చేయి వేసింది తట్టడానికి. . .

## 1 + 2

. సృష్టికి జీవం పోయడం కోసం, సృష్టి రహస్యం అన్వేషించడం కోసం చీకటిలో తడుముకుంటున్న ఆ భార్యా భర్త లిద్దరికీ అంతరాయం కలిగింది.

ఆ గదిలో వెలుతురే తప్ప చీకటి లేదిప్పుడు.

ఇంత వర్షంలో రాత్రి పూట తలుపు తడుతున్న మనిషి మీద విపరీతమైన కోపం వచ్చింది రాజుకి. తీరని కోరికతో ఇబ్బందిగా అటు తిరిగి పడుకుంది ఆమె—ఒళ్ళు మండుతుంటే.

కోపంగాను, అసహనంగాను తలుపు తీసిన రాజు ఒకడుగు వెనక్కి వేశాడు. ఉలిక్కి పడ్డాడు. చలిగాలితోపాటు వర్షం జల్లు విసురుగా ముఖం మీద కొట్టింది. అందుక్కాదు అతను ఉలిక్కిపడింది... ఆమెని చూసి, ఆమె ఆకారాన్ని చూసి. . .

అస్థిపంజరానికి తోలు అతికినట్లుంది పొట్ట మీద తోలుకుట్టిన కుండ ఒకటి బోర్లించినట్లుంది

"ఏం కావాలి?" విసుగ్గా అడిగాడు.

అప్పుడు వర్షం ఆమె దైన్యస్థితికి 'చీకటి' కరిగి పోయి కారిపోతున్నట్లు కురుస్తూంది నల్లగా. కాని అతనికి మాత్రం విసుగ్గా కురుస్తున్నట్లనిపించింది.

"బాబుగారూ! ఇంతవర్షంలో ఎక్కడికి పోలేను. ఈ రాత్రి కిక్కడే. . ."

అతను సమాధాన మివ్వలేదు. లోపలి గదిలో కెళ్ళాడు.

భార్యతో రెండు నిమిషాలు. . . అనంతరం ఆమె వెనక అతను ఆ ముష్టిదాని దగ్గరికి.

"ఏం కావాలి?" భర్త అడిగిన ప్రశ్ననే మరింత విసుగ్గా అసహ్యం ఉట్టిపడేలా అడిగింది.

"అయ్యగారికి చెప్పానమ్మా. . ." ఆమె స్వరం లోనూ, వదనంలోనూ దీనత్వం.

"లాభం లేదు ఇక్కడ ఖాళీ లేదు. . ."

"అమ్మా అలా అనకండమ్మా. . . కడుపులో కొద్దిగా నొప్పికూడా వేస్తున్నట్లుంది. . ."

"అందుకే వద్దంటున్నా. . . ఇక్కడ మళ్ళీ వెధవ గొడవ. . . నీకు చాకిరీ ఒకటి. . .?

ముష్టిది తారస్థాయిలో బతిమాలుతూంది. . . ఆమె అదే స్థాయిలో తిరస్కరిస్తూంది.

'అది' ఏడుస్తూంది. ఏడుస్తున్నట్లు తెలియకుండా వర్షం నీరు ఆమె నుదురు మీంచి కనురెప్పల పైనుంచి. . .

ఒకే ఒక క్షణం అలా నుంచుండి పోయింది.

"అయినా ఒళ్ళు కొవ్వెక్కి కాకుంటే అడుక్కునే దానికి కడుపొకటి. . ." చాలా నీచంగా చూసిందామె ముష్టిదానిని.

ఆ మాట వినడం కోసమేనేమో ఆమె అక్కడ నుంచున్నది.